


సంతకాల వేళ ఆనంద హేల



మంచిరోజులొచ్చాయ్

- ఎన్నికల హామీలను నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు
- జిల్లాలో నిరుద్యోగులు, నిరుపేదలు, యువత, రైతుల్లో హర్షం
- మెగా డీఎస్సీ ఫైలుపై సంతకంతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో ఇకపై పేదలకు కడుపునిండా భోజనం
- పింఛను సొమ్ము పెంపుతో వచ్చే నెల నుంచి జిల్లాలో 2.45 లక్షల మందికి లబ్ధి
- భూ హక్కు చట్టం రద్దుతో ప్రజల భూములకు రక్ష... పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ కూడా తొలగింపు
- నైపుణ్య గణన ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి భీమా

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు గురువారం సంతకాలు చేయడంతో జిల్లాలో అన్ని వర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. చెప్పిన విధంగానే మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగుల ఆనందాలకు అవధు ల్లేకుండా పోయాయి. ప్రజల భూములకు రక్షణ లేకుండా చేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తానన్న రెండో హామీపై రైతుల సమక్షంలోనే సంతకం చేశారు. సామాజిక భద్రతా పెన్షన్‌ను రూ.4వేలకు పెంపు ఫైలుపై లబ్ధిదారుల సమక్షంలో మూడో సంతకం చేశారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, నైపుణ్య గణన ఫైలుపై విద్యార్థుల సమక్షంలో ఐదో సంతకం చేశారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వచ్చే నెల నుంచి రూ.4వేలు చొప్పున పెన్షన్ తీసుకోబోతున్నామంటూ వృద్ధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2,45,135 మంది వివిధ రకాల పెన్షన్లు పొందుతున్నారు. వీరికి నెలకు రూ.71,33,33,000 పెన్షన్ రూపంలో చెల్లిస్తున్నారు. చంద్రబాబు హామీ అమలులోకి రానుండడంతో వారంతా అధికంగా పెన్షను పొందే అవకాశం ఉంది. అంటే నెలకు రూ.96 కోట్లు పైబడి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం రూ.2వేలు పెన్షన్‌ను రూ.3వేలకు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. చివరకు దఫదఫాలుగా పెంచుతూ పదవీకాలం ముగుస్తున్న వేళ రూ.3వేలకు పెంచింది. చంద్రబాబు పెన్షన్‌ను రూ.4వేలకు పెంచడంతో పాటు పెంచిన మొత్తాన్ని ఏప్రిల్, మే, జూన్ నెలలకు వర్తింపచేస్తానని హామీ ఇచ్చారు. దాంతో జూలై నెలలో ఒక్కో పెన్షన్‌దారుడు రూ.7వేలు పెన్షన్ పొందే అవకాశం ఉంది. దాంతో పెన్షన్‌దారుల ఆనందానికి అవధుల్లేవు. జిల్లాలో 1,29,599 మంది వృద్ధాప్య పెన్షన్లు పొందుతుంటే అభయ హస్తం కింద 10,556 మంది, 5373 మంది మత్స్యకారులు, 164 మంది కళాకారులు, 12 మంది సైనికులు, 3242 మంది చర్మకారులు, 5256 మంది చేనేత కార్మికులు, 1193 మంది ఆర్ట్ పెన్షన్లు పొందుతున్నారు. వీరితో పాటు 32,746 మంది దివ్యాంగులు, 824 మంది డీఎంహెచ్‌వో పెన్షన్లు, 4556 మంది ఒంటరి మహిళలు, 49,821 మంది వితంతువులు పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధాప్య పెన్షన్లు ఏయే వర్గాల వారికి వర్తింపచేస్తారో తెలియాల్సి ఉంది. జూలై నెలలో పెన్షన్‌ను రూ.7వేలు చొప్పున చెల్లిస్తారా లేక రూ.4వేలు చొప్పున అందజేస్తారా అనేది అధికారిక ఉత్తర్వులు విడుదలైతే గానీ చెప్పలేమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లు నిర్వహించేవారు. రూ.5కే పేదలు కడుపునిండా భోజనం చేసేవారు. వైసీపీ వచ్చాక వాటిని మూసేసింది. తిరిగి వాటిని తెరిపిస్తూ చంద్రబాబు సంతకం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ కొత్తగా అన్న క్యాంటీన్లను ప్రభుత్వం తెరవనుంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో వేలాది మంది పేదల సొంత భూములను లాక్కునే ప్రయత్నం చేసింది. ప్రజలంతా ధీమాగా ఉండేలా ఈ చట్టాన్ని రద్దు చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ తొలగిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ సెన్సెస్ విధానం అమల్లోకి తెచ్చారు. నిరుద్యోగ యువత వద్దకు అధికారులు వెళ్లి సర్వే చేస్తారు. వారికి ఏ పని చేయడం ఇష్టమో కనుక్కుని నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి లభించేలా చూస్తారు.

'తూర్పు'కిక మహర్దశ

- అభివృద్ధిలో బంధుత్వాలు కలిసొచ్చే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో రెండు ప్రధాన పార్టీల రాష్ట్రాధ్యక్షులు
- ఇటు పురందేశ్వరి, అటు పవన్‌కల్యాణ్‌పై ఎన్నెన్నో ఆశలు
- ఉమ్మడి ప్రభుత్వానికి బీజం పడిందీ.. కీలక మలుపులూ ఇక్కడే
- 2027 పుష్కరాలూ చంద్రబాబు హయాంలోనే..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



దెబ్బతిన్న సింహం శ్వాస కూడా గర్జనకంటే భయంకరంగా ఉంటుందంటారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా 'చంద్రబాబు అనే నేను' అనే పదంలో అదే ధ్వనించింది. ఆ గర్జనతో రాష్ట్రానికి పట్టిన చీకటి పటాపంచలైపోయింది. రాష్ట్రం మళ్లీ గాడిలో పడింది. అయితే తమ ప్రాంతానికి మహర్దశ పట్టనుందనే ఆనందంలో గోదావరి తీరవాసులు సంబరపడుతున్నారు. దశ తిరగనుందని భావిస్తున్నారు. ముందు నుంచీ టీడీపీని తూర్పువాసులు ఇంట్లో కుటుంబ సభ్యుడి మాదిరిగా ఆదరించారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ అయితే తెలుగుదేశానికి కంచుకోట అని చెప్పక తప్పదు. గత ఎన్నికల వైసీపీ సుడిగాలిలో కూడా ఈ రెండు చోట్లా టీడీపీని కదిలించలేకపోయారు. ఇప్పుడు అంతకుమించి అక్కున చేర్చుకున్నారు. జనం ఐదేళ్లుగా ఎదురు చూసిన 'చంద్రో'దయానికి అంకురార్పణ మన 'తూర్పు'లోనే జరగడం విశేషం. ఇక తూర్పుగోదావరిలో పదవులు అలంకరించిన వారి బంధుత్వాలు జిల్లాకు కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో, కేంద్రంలో కీలకంగా మారిన నేతలకు జిల్లాలోని ప్రజాప్రతినిధులతో దగ్గరి బంధుత్వాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ముఖ్యమంత్రి చంద్రబాబు మరిది అవుతారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి పురందేశ్వరి స్వయానా అక్క. అలాగే రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు బావమరిది, ఆయన సతీమణి భవానీ తమ్ముడు కింజారపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర ప్రభుత్వ కేబినెట్‌లో పౌర విమానయాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. భవానీ చిన్నాన్న కింజారపు అచ్చెన్నాయుడు రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ బంధుత్వాలు జిల్లాకు ముఖ్యంగా రాజమహేంద్రవరం నగర రూపురేఖలు మార్చడంలో ఎంతగానో సహాయపడతాయనే చర్చ నడుస్తోంది.

● అనుభవం కలిసొస్తే...

ఎంపీ విజేత పురందేశ్వరికి అటు రాజకీయం ఇటు పరిపాలనాపరంగా అపార అనుభవం ఉంది. ఎన్టీఆర్ కూతురిగా మరింత అభిమానం ప్రజల్లో ఉంది. ఆమెకు కేంద్ర ప్రభుత్వంలో చెప్పుకోదగిన పరిచయాలు ఉన్నాయి. గతంలో కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఢిల్లీలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలతోపాటు ప్రధాని మోదీ దగ్గరకు కూడా సునాయాసంగా వెళ్లగల పలుకుబడి ఉంది. ఆమె గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఇటు జిల్లా యువతకు, అభివృద్ధికి పనిచేస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కేంద్రం నుంచి భారీ ప్రాజెక్టులు వస్తే ఐదేళ్ల నుంచీ ఉపాధి లేక ఎదురు చూస్తున్న యువతకు ఊతమవుతుందని ఆశిస్తున్నారు. అలాగే అభివృద్ధి విషయంలోనూ ముఖ్యంగా రాజమహేంద్రవరాన్ని పట్టిపీడిస్తున్న ముంపు నీరు, కలుషిత తాగునీరు, డెడికేటెడ్ చానెల్, పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి, గోదావరిపై రైలు మరో రైలు వంతెన వంటి వాటికి కేంద్ర నిధులతో పరిష్కారం దొరకుతుందని ఆశిస్తున్నారు. నిడదవోలు శాసనసభ నుంచి గెలిచి మంత్రి పీఠం దక్కించుకున్న కందుల దుర్గేశ్‌కి కూడా పరిపాలనా అనుభవంతో పాటు జిల్లాపై పూర్తిస్థాయిలో పట్టుంది. సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు రాజకీయంగా కాస్త అనుభవం ఉన్నా పరిపాలనాపరంగా పట్టు సాధించాల్సి ఉంది. ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు, చినమామ కింజారపు అచ్చెన్నాయుడు, బావమరిది రామ్మోహన్‌నాయుడుకు ఉన్న రాజకీయ, పరిపాలనా అనుభవం ఆదిరెడ్డి వాసుకు కలిసొచ్చే అంశమే. ఇవన్నీ జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాయని గోదావరోళ్లు ఎదురు చూస్తున్నారు.

రెండు పార్టీల రాష్ట్రాధ్యక్షులు

ఉమ్మడి తూర్పుగోదావరికి మరొక ప్రాముఖ్యత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని రెండుచోట్ల కీలకమైన పార్టీల అధ్యక్షులు బరిలో దిగి అదరగొట్టారు. పిఠాపురం శాసనసభ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ ఘన విజయం సాధించారు. డిప్యూటీ సీఎం హోదాను పవన్‌కల్యాణ్‌కి ఇచ్చి కూటమి గౌరవించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన ఇప్పుడు పిఠాపురం నియోజకవర్గ రూపురేఖలు మారుస్తారని ప్రజలు బలంగా ఆశిస్తున్నారు. పవన్ కూడా తనను ఆదరించిన నియోజకర్గానికి ఏదొక శాశ్వత మేలుచేయాలనే తపనతో ఉన్నట్టు చెబుతున్నారు. పవన్ డిప్యూటీ సీఎం కూడా కావడంతో ఉమ్మడి తూర్పునకు కూడా గట్టి మేలు జరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం ఎంపీ విజేత పురందేశ్వరి బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు. బీజేపీలో మంచి పలుకుబడి ఉంది. కీలకమైన పదవులు అలంకరించిన అనుభవం ఆమె సొంతం. బీజేపీతోపాటు కేంద్ర, రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో కూడా మంచి సఖ్యత ఉంది. పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు మేలు జరగడం ఖాయమని భావిస్తున్నారు.

2027 పుష్కరాలూ చంద్రన్న హయాంలోనే..

గత పుష్కరాలకు 2015లో చంద్రబాబు ఏకంగా 12 రోజులు ముఖ్యమంత్రి హోదాలో రాజమహేంద్రవరంలోనే బస చేశారు. కేబినెట్ సమావేశాన్ని సైతం ఇక్కడే నిర్వహించారు. గోదావరి ఘాట్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు ఇచ్చారు. దేశంలోనే పెద్దదైన కోటిలింగాల ఘాట్‌ను అప్పుడే నిర్మించారు. నగరమంతా అద్దంలా తీర్చిదిద్దారు. అప్పట్లో కొందరు అధికారుల అలసత్వం వల్ల తొలిరోజున ఊహించని ఉప్పెన ఎదురైనా ఎక్కడా నిబ్బరం కోల్పోలేదు. వైసీపీ శవరాజకీయాలు చేసినా చలించలేదు. వందల మంది అధికారులు, సిబ్బంది ఉన్నా- చంద్రన్నే స్వయంగా లోటుపాట్లను తెలుసుకొని తక్షణ పరిష్కారం చూపిస్తూ పుష్కరాలను ఔరా అనిపించారు. రైల్వేస్టేషను, బస్టాండ్, యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాలు తదితర చోట్లకు అర్ధరాత్రి వేళలో కూడా వెళ్లి సదుపాయాలపై ప్రజలను ఆరా తీసేవారు. బ్రిటిష్ వాళ్ల నాలిక తిరగక చారిత్రక నగరానికి మార్చేసిన పేరును మళ్లీ తీసుకొచ్చారు. రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మార్పుచేస్తూ ఇక్కడే చంద్రబాబు ఒక ప్రకటన చేశారు. మొత్తానికి ఓ మినీ కుంభమేళా మాదిరిగా ఆ ఏడాది పుష్కర ఉత్సవాలు జరిగాయి. ఈ పుష్కరాలకు జ్ఞాపకంగా దివాన్‌చెరువు సమీపంలో ఉన్న అటవీ వనాన్ని పుష్కర వనంగా తీర్చిదిద్ది నగర ప్రజలకు కానుకగా ఇచ్చారు. 2027లో మళ్లీ ఆయన చేతుల మీదుగానే పుష్కరాల క్రతువును గోదారమ్మ నిర్వహించుకోనుంది.



సభలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జాతీయ కార్యదర్శి టాన్యా

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభలో వక్తల పిలుపు

మండపేట, జూన్ 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం ముసుగులో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కార్మికులను సరుకుగా వాడుకుని కోట్లు దండుకుంటున్నాయని ఐఎఫ్‌టీయూ నేతలు ఆరోపించారు. ఎందరో కార్మిక నేతల పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మికుల హక్కులను ప్రభుత్వాలు అమలు చేయకుండా చెత్తకుప్పలో పారేశాయని సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జాతీయ కార్యదర్శి పి.టాన్యా ఆరోపించారు. మండపేట పట్టణంలోని నాళం వారి సత్రం (కామ్రేడ్ కె.రామారావు ప్రాంగణం)లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ బాడీ కౌన్సిల్ సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత అమరవీరుల ఎర్ర జెండాను రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అమరులైన కార్మికులకు సంతాప తీర్మానాన్ని వెంకటేశ్వరరావు ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. దేశంలో 40కోట్ల మంది కార్మికులు, అసంఘటిత కార్మికులు, భవన, రైస్‌మిల్లు కార్మికులు వివిధ పరిశ్రమల్లో కార్మికులు కూలీలుగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించకపోవడంతో భద్రతలేని జీవితం గడపాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వాలు గత పదేళ్లలో 99శాతం మేర పరిశ్రమలను ప్రైవేటుపరం చేశాయని, 44 కార్మిక చట్టాలను కోడ్‌లుగా మార్చేశాయని, 8 గంటల పనిదినాలను 12 గంటలుగా మార్పివేశాయని ఆరోపించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు. సభ అనంతరం పట్టణంలో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.కిరణ్ కుమార్, పీవోడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయ, ఎమ్మార్పీఎస్ నేత దూళి జయరాజు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి వి.భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, వి.చిట్టిబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, కార్మికులు, మైనార్టీ సెల్ నాయకులు రహీం, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేట పునః ప్రారంభం

అంతర్వేది, జూన్ 13:
అంతర్వేది పల్లిపాలెం మినీ హార్బరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మత్స్య శాఖ జేడీ శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన హార్బరు పరిసరాలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రంలో 45 రోజులు వేట విరామం శుక్రవారంతో పూర్తయి 15 నుంచి పునః ప్రారంభం అవుతుందన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు హార్బరుకు తీసుకువచ్చి కొత్త ప్రభుత్వంలో హార్బరులో మరిన్ని మార్పులు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. జేడీ వెంట ఏడీ హర్షవర్ధన్, మత్స్య శాఖ సిబ్బంది వున్నారు.

భూమి ఒకరిది... రుణం మరొకరికి...!

- చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రూ.30 లక్షలకు పైగా రుణాలు
- నకిలీ కౌలు రైతు కార్డులు మంజూరు చేసిన వీఆర్వో
- నర్సిపూడిలో వెలుగుచూసిన వైనం
- గోప్యంగా అధికారి విచారణ
- లబోదిబోమంటున్న భూముల యజమానులు

అలమూరు, జూన్ 13: బ్యాంకులో రుణం కావాలంటే సవాలక్ష పత్రాలు కావాలంటారు... దాదాపు 30ఏళ్ల పైబడి ఈసీ కావాలంటారు... అవన్నీ ఇచ్చినా ఆయా బ్యాంకు లీగల్ అథారిటీ వద్ద నుంచి పత్రం ఉంటేనే కానీ రుణం మంజూరు చేయరు... అలాంటిది మరొకరి భూమిపై లక్షల్లో కౌలు రైతు రుణాలు మంజూరు చేశారు... ఇది ఆశ్చర్యం కాదండోయ్. అక్షరాలా నిజం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడిలో చోటుచేసుకున్న ఘటన ఇది.

ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన ఐదుగురు రైతుల భూములను భూ యజమానికి తెలియకుండా ఎవరో కౌలు చేస్తున్నట్టు నకిలీ కౌలు రైతు కార్డులను 2019-20 సంవత్సరంలో అప్పటి గ్రామ రెవెన్యూ అధికారి మంజూరు చేశారు. ఈ పత్రాలపై భూ యాజమానికి అనుమతి కానీ, ఎటువంటి సిఫార్సు కానీ లేకుండా కౌలు రైతు కార్డులను వీఆర్వో అందించారు. ఈ కార్డుల ద్వారా అప్పటి నర్సిపూడి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఐదుగురి పేరున దాదాపు రూ.30లక్షలు రుణాలు మంజూరు చేశారు. అయితే పంట రుణాలకు ప్రతిఏటా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ అప్పటి నుంచీ ఎటువంటి చెల్లింపులు చేయకుండా ఉంచారు. భూముల యజమానులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, పాస్ పుస్తకాలతో ఇటీవల నర్సిపూడిలోని సహకార సంఘానికి రుణాలు తీసుకోవడానికి వెళ్లారు. మీ భూమిపై ఇక్కడ రుణం ఉందని, అది చెల్లిస్తేనే గానీ ఇక్కడ కొత్త రుణాలు ఇవ్వడం వీలుకాదని చెప్పారు. దీంతో రైతులు లబోదిబోమంటూ గ్రామీణ బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. వీఆర్వో మంజూరు చేసిన కౌలు రైతు కార్డుల ద్వారా రుణాలు మంజూరు చేశామని బ్యాంకు అధికారులు చెప్పినట్టు బాధిత రైతులు స్థానిక విలేకరులకు చెప్పారు. అక్కడి నుంచి వీఆర్వో కార్యాలయానికి వెళ్లి అడగ్గా... అప్పటి వీఆర్వో బదిలీ అయ్యారని, తమకు ఏమీ తెలియదని ప్రస్తుత అధికారులు చెప్తున్నారని వారు వివరించారు.




భూ యాజమాని అనుమతి లేకుండా మంజూరు చేసిన కౌలు కార్డు

బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు

తమ అనుమతి లేకుండా తమ భూమిపై పంట రుణం మంజూరు చేశారని, రుణాలు తీసుకోవడంలో తమకు ఎటువంటి సంబంధం లేదని... విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఉన్నతాధికారులుకు నర్సిపూడి రైతులు వాసిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, రావిపాటి నాగేంద్రకుమార్ వారం క్రితం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రీజనల్ కార్యాలయానికి చెందిన ఒక అధికారి గురువారం గోప్యంగా విచారణ చేపట్టారు. (ఆమె పేరు చెప్పడానికి నిరాకరించారు). దీంతో మోసం బయటపడింది. వీఆర్వో ఇచ్చిన కౌలు రైతుల కార్డుల ఆధారంగానే రుణాలు అందించామని... దీనిలో తమ తప్పు ఏమీ లేదని బ్యాంకు అధికారులు చెప్తున్నారు.

మా భూమి మీద రుణం ఏమిటి

వాసిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, రైతు



మా అనుమతి లేకుండా మా భూమిపై రుణం మంజూరు చేయడమేమిటని బ్యాంకు అధికారులను అడిగితే మీకు చెప్పాల్సిన అవసరం లేదు... వీఆర్వోను అడగండని చెప్తున్నారు. నా భూమిపై రుణం మంజూరు చేసినా నాకు సంబంధం లేదని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

రుణం నాన్‌పే కావడంతో నకిలీ బయటపడింది

రావిపాటి నాగేంద్రకుమార్, రైతు



బ్యాంకులో నకిలీ కౌలు రైతు కార్డులు పెట్టి రుణాలు తీసుకున్నారు. అయితే ఈ రుణాలు ఎన్‌పీ (నాన్ పే) కావడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. మాకు న్యాయం జరగాలి.

జూలై 1 నుంచి నాఫెడ్ కేంద్రాల్లో కొబ్బరి కొనుగోళ్లు

ఈ నెల 19 నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి: ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజరు సుధాకరరావు



అంబాజీపేట, జూన్ 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే నాఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో కొబ్బరిని విక్రయించుకునేందుకు ఈ నెల 19వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజరు యు.సుధాకరరావు కోరారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ ఎండీ చావెల బాబూరావు ఆదేశాల మేరకు జూలై ఒకటో తేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. మిల్లింగ్ క్వింటాలుకు కోప్రాకు రూ.11,120, బాల్‌కోప్రాకు రూ.12వేలు మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి మాత్రమే కొబ్బరిని కొనుగోలు చేస్తామన్నారు. కొబ్బరి తేమ శాతం, దుమ్ము, ధూళి తదితర అంశాలను రైతులు పాటించాలన్నారు. మూడు నెలల పాటు కొబ్బరి కొనుగోలు చేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సుధాకరరావు కోరారు.

రావులపాలెం మండలం రావులపాడులో
రూ.1.28 లక్షల పీడీఎస్ బియ్యం సీజ్...7లో

ఘాటెక్కిన ఉల్లి

నెం.1 రకం కిలో రూ.60పైనే



ఆలమూరు, జూన్ 13: వారం క్రితం వరకు బాగానే ఉన్న ఉల్లిపాయల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. మార్కెట్లో నెం.1 రకం కిలో రూ.60పైగా పలుకుతుండడంతో సామాన్యులు బెంబేలెత్తున్నారు. నాసిరకం, సాధారణ రకాలు రూ.40 నుంచి రూ.50 వరకు వున్నాయి. నిన్న, మొన్నటి వరకు వేసవితాపానికి కూరగాయల తోటలు దెబ్బతిని కూరగాయల ధరలు బాగా పెరిగాయి. అయితే ప్రస్తుతం ఆ జాబితాలో ఉల్లిపాయ కూడా చేరింది. మడికి అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు ఉల్లిపాయలను మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటారు. అయితే ఇటీవల అక్కడి నుంచి ఉల్లిపాయలు రావడం తగ్గడంతో ధరలు గణనీయంగా పెరిగినట్టు ఇక్కడి వ్యాపారులు చెప్తున్నారు. మహారాష్ట్రలో ఉల్లి కొత్త పంట ఆలస్యం కావడం వల్ల అక్కడ ఎగుమతులు లేక డిమాండ్ ఎక్కువ ఉన్నట్టు చెప్తున్నారు. సామాన్యుల ఇబ్బందులను గుర్తించి రైతు బజార్లలో తక్కువ ధరకు ఉల్లి అమ్మకాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా

- 50 మంది వరకూ బాధితులు
- వివిధ ఆస్పత్రుల్లో చికిత్స
- గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు
- కలుషిత జలమే కారణమంటున్న గ్రామస్థులు


ఏవీ నగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

తొండంగి,జూన్ 14: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో డయేరియా ప్రబలింది. సుమారు 50 మంది వరకూ వ్యాధిబారిన పడి వాంతులు విరేచనాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వ్యాధి ప్రబలేందుకు కలుషిత తాగునీరే కారణమని పలువురు గ్రామస్తులు పేర్కొంటుండగా మరికొందరు నిల్వ ఉన్న రొయ్యల కూర తినడం ,మామిడి తాండ్ర తినడం వలన వ్యాధి వచ్చిందంటున్నారు. వ్యాధిబారిన పడిన వారిలో మహిళలు, చిన్నపిల్లలు ఎక్కువగా ఉండడంతో ఆందోళనకు గురైన కొందరు నేరుగా కాకినాడ, కత్తిపూడి, అచ్చంపేట, సీతయ్యపేట తదితర గ్రామాల్లో గల ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం తరలి వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటా సర్వే జరిపి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. తీవ్రమైన అస్వస్థతతో ఉన్న ఐదుగురిని ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జనరల్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. కొందరికి డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సరిత, డాక్టర్ రవికుమార్ గ్రామంలో పర్యటించారు. పరిస్థితి అదుపులోనే ఉందని ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని తెలిపారు. నీటి వనరులు క్లోరినేషన్ చేయించాలని, తాగునీటి పైపుల లీకేజీ ఉంటే పరిశీలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినాలని సూచించారు. గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉండగా ఓసీ, బీసీ కాలనీ వాసులు తాగునీరు తాగే ప్రాంతంలోనే వ్యాధి బాధితులు ఎక్కువగా ఉండడంతో నీటి కలుషితమే ప్రధాన కారణంగా ఉండవచ్చని అంటున్నారు,


గ్రామంలో పర్యటిస్తున్న వైద్య శాఖ ఉన్నతాధికారులు

20వ తేదీ తర్వాత పిఠాపురంలో పర్యటిస్తా: పవన్‌కల్యాణ్

పిఠాపురం, జూన్ 13: శాసనసభ సమావేశాలు, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుస్తానని రాష్ట్ర మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ నెల 20వ తేదీ తర్వాత పిఠాపురంలో తన పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మీడియాకు గురువారం మంగళగిరి నుంచి వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలో కార్యకర్తలను కలిసిన అనంతరం దశలవారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అన్ని వైపుల నుంచి శుభాకాంక్షలు, అభినందనలు అందుతూనే ఉన్నాయని చెప్పారు. ప్రజాజీవితంలో ఉన్న నాయకులు, మేధావులు, నిపుణులు, సినీరంగ ప్రముఖులు, యువత, రైతులు, ఉద్యోగవర్గాలు, మహిళలు అభినందనలు అందిస్తున్నారని చెప్పారు. జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు ఆనందంతో వేడుకలు చేసుకున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనను నేరుగా కలిసి అభినందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారని చెప్పారు. త్వరలో వారందరిని జిల్లాల వారీగా కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నానని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తానని తెలిపారు. అభినందనలు తెలియజేయడానికి వచ్చే వారు పూలబొకేలు, శాలువాలు తీసుకురావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోలవరం నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నంపై హెచ్‌ఆర్సీ స్పందన

చీఫ్ సెక్రటరీ, పునరావాస కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు

గోకవరం, జూన్ 13: తూర్పుగోదావరి జిల్లా గోకవరం శివారులోని పోలవరం నిర్వాసితుల కాలనీకి చెందిన ఉన్నమట్ల సీతారామయ్య అనే వృద్ధ నిర్వాసితుడు గత నెల 24వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఆంధ్రజ్యోతి ఇతర మీడియాలలో వచ్చిన కథనాల నేపథ్యంలో రంపచోడవరం న్యాయవాది ఎంవీఆర్ ప్రకాష్ సంబంధిత సంఘటనపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన కమిషన్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం పునరావాస కార్యక్రమాల అమలు, నిర్వాసితులకు చేసిన అన్యాయాలను మీడియా కథనాల ద్వారా పరిశీలించింది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి, పునరావాస కమిషనర్‌కు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు ఈనెల 11వ తేదీన నోటీసులు జారీ చేసి సంజాయిషీతో పాటు, సమగ్ర నివేదికను కోరింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దేవీపట్నం మండలంలోని సుమారు 36 గ్రామాలు భూములు, ఇళ్లు సర్వస్వం కోల్పోయి ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా రాజమహేంద్రవరం (ధవళేశ్వరం) కేంద్రంగా నడుస్తున్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఈ పునరావాస కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌తో పాటు అనుబంధ అధికారులు నిబంధనలు ప్రకారం పోలవరం నిర్వాసితుల భూములకు నష్టపరిహారాన్ని, పునరావాస ప్యాకేజీని, పునరావాస కాలనీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో నిర్వాసితులు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా చంద్రబాబు పాలన అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పునరావాసాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పోలవరం కోసం త్యాగం చేసిన నిర్వాసితులు రోడ్డున పడ్డారు. ఈ పరిస్థితిని భరించలేని ఉన్నమట్ల సీతారామయ్య లాంటి నిర్వాసితులు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ తనకు అందిన ఫిర్యాదుపై తక్షణం స్పందించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పునరావాస కమిషనర్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదికల ఆధారంగా కమిషన్ తదుపరి చర్యలు తీసుకుంటుంది.



వాడపల్లి హుండీల ఆదాయం లెక్కింపు

ఆత్రేయపురం, జూన్ 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 28 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.77,65,489, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.19,32,588... మొత్తం రూ.96,98,077 ఆదాయం లభించింది. 33 గ్రాముల బంగారం, 580 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,53,803 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

గోపాలపురం. జూన్ 13: గోపాలపురం మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారులో అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి మణికంఠ చౌదరి(అయ్యప్ప) వయస్సు 31.. అప్పుల కారణంగా గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గురు వారం మధ్యాహ్నం కోడూరి వెంకటరమణకు చెందిన పొలంలో ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరపల్లి సీఐ కె.బాల సురేష్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వీఆర్‌వో పంచనామా అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. అయ్యప్పకు భార్య, ఏడాది పాప ఉన్నట్లు తెలిపారు.

రావులపాడులో ఆయిల్ దుకాణం దగ్ధం

రూ.పది లక్షల ఆస్తి నష్టం




రావులపాలెం, జూన్ 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు పరిధిలో రహదారి చెంతనే ఉన్న ఒక మడ్డి ఆయిల్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కొత్తపేట అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రావులపాలానికి చెందిన నంబూరి రామమురళీమోహన్ రావులపాడు పరిధిలో మడ్డి ఆయిల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో మెకానిక్ షెడ్ల వద్ద నుంచి సేకరించిన పాత ఆయిల్‌ను నిల్వ ఉంచి విక్రయాలు సాగిస్తుంటారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్మేసి చీకటిగా మారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొత్తపేట, మండపేట అగ్నిమాపక శకటాలతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. టాటా ఏస్ వాహనం, పది టైర్ల పాత ట్యాంకరు, నిసాన్ కారుతో పాటు ప్లాస్టిక్ ఆయిల్ పీపాలు, షెడ్డు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు.

చెరువులో పడి అక్కాచెల్లెళ్లు మృతి

- అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో విషాదం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష


కావ్యశ్రీ


సాహితి

అడ్డతీగల జూన్ 13: అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో అక్కాచెల్లెళ్లు చెరువులో పడి మృతిచెందారు. ఆలస్యంగా ఆ విషయం వెలుగుచూసింది. సోమన్నపాలెం గ్రామానికి చెందిన వంతల కావ్యశ్రీ (13), సాహితి(10) కాలకృత్యాల కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు బుధవారం వెళ్లారు. ప్రమాదవశాత్తు సాహితీ చెరువులో పడిపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో సోదరి కావ్యశ్రీ కూడా చెరువులోకి జారిపోవడంతో ఇరువురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించారు.



యనమలను కలిసిన మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13: శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును విజయవాడలో గురువారం మంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సుభాష్‌ను యనమల అభినందించారు. మంత్రి సుభాష్ వెంట టీడీపీ నాయకులు గంధం పళ్లంరాజు, రాయపురెడ్డి సూరిబాబు, దొంగల శ్రీధర్ ఉన్నారు.


ప్రాజెక్టు పత్రాలను అందుకుంటున్న విజయనిర్మల

గోదావరి క్లస్టర్ విశ్వవిద్యాలయానికి యాప్షీ ప్రాజెక్టు మంజూరు

దివాన్‌చెరువు, జూన్13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (యాప్షీ) గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్టు మంజూరు చేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌లలో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగ అధ్యాపకులు పి.విజయనిర్మలకు ప్రాజెక్టు పత్రాలను గురువారం వీసీ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులకు వివరాలు అందించారు. యాప్షీ గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి, డాక్టర్ వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయాలకు రూ.10 లక్షల ప్రాజెక్టు మంజూరు చేశారన్నారు. ఈ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లుగా నన్నయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు విజయనిర్మల, తాడేపల్లి గూడెంలోని ఎన్.ఐ.టి. జీవ సాంకేతిక విజ్ఞానశాస్త్రం అధ్యాపకుడు టి.జగన్మోహనరావు, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం జీవ రసాయనశాస్త్రం ఆచార్యులు డి.ఆర్.సలోమిసునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

89వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న తాతీలు

కరప, జూన్ 13: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడమే గాక యువకులను ప్రోత్సహించి వారితో కూడా రక్తదానం చేయిస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారు కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి నారయ్య(తాతీలు). అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన 89వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. బిక్కవోలు మండలం బాలవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి అమ్ములు అనే మహిళకు అత్యవసరంగా బ్రెయిన్ సర్జరీ చేయాల్సి వచ్చింది. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు బ్లడ్ అవసరమని ఆమె బంధువుల ద్వారా తెలుసుకున్న తాతీలు వెంటనే ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న తాతీలును ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు బి.శ్రీహరిబాబు, జి.లక్ష్మి తదితరులు అభినందించారు.

40వ సారి రక్తదానం



కొత్తపల్లి, జూన్ 13: జాతీయ రక్తదాన దినోత్సవం (బ్లడ్ డోనర్స్ డే) శుక్రవారం కావడంతో 40వ సారి రక్తాన్ని దానం చేసేందుకు సిద్ధమయ్యారు కొత్తపల్లి మండలం కొత్తమూలపేట సెజ్ పునరావాస ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు అడపా వెంకటశ్రీనివాసరావు. రోడ్డు ప్రమాదాల్లో రక్తం కోల్పోయి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి వారికి రక్తాన్ని దానం చేయడం ద్వారా నిండు ప్రాణాన్ని కాపాడవచ్చునని ఆయన చెప్పారు. రక్తం దానం చేయడం ద్వారా శరీరంలో శక్తి కోల్పోతామన్నది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరూ సంవత్సరానికి ఒకటి లేక రెండు సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. గత సంవత్సరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 39వ సారి రక్తాన్ని దానం చేశానని, చెప్పారు.

మొక్కు తీర్చుకున్న చంద్రబాబు అభిమాని


చంద్రబాబు ఫొటోతో మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న సుబ్రహ్మణ్యం

కడియం, జూన్ 13: కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు సీఎం అయితే గౌరీపట్నంలో మేరీ మాత ఆలయానికి వచ్చి మోకాలిపై మెట్లు ఎక్కి మేరీ మాతను దర్శించుకుంటానని కడియం గ్రామానికి చెందిన జువ్వల సుబ్రహ్మణ్యం మొక్కుకున్నాడు. కోరిక నెరవేరడంతో చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజున మేరీ మాత ఆలయం వద్ద ఉన్న సుమారు 160 మెట్లను చంద్రబాబునాయుడు ఫొటో పట్టుకుని మోకాళ్లపై ఎక్కాడు. తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు. ఆర్టీసీ డ్రైవరుగా పని చేసే సుబ్రహ్మణ్యం రెండేళ్ల కిందట ఈ మొక్కు మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని అభినందించారు.

నిబంధనల మేరకు కొత్త అడ్మిషన్లు

విద్యాశాఖాధికారులతో ఐటీడీఏ పీవో వీడియో కాన్ఫరెన్స్

రంపచోడవరం, జూన్ 13: పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త అడ్మిషన్ చేసుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయ చాంబరులో విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థులకు వారి అర్హతలను బట్టి అడ్మిట్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని పీవో సూచించారు. ఎటువంటి తప్పులు జరగకుండా ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో మలేరియా దోమల మందును స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించాలన్నారు. పాఠశాలల్లో వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు అందంగా ఉండేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి డీడీ తేజస్విని, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కె.సుజాత, ప్రసాద్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్


బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

అమలాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడులోని ఖాళీ స్థలంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో గురువారం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం దాడులు నిర్వహించింది. 52 బస్తాల్లో 2645 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. సత్తి సతీష్ అనే వ్యక్తి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పరిసర ప్రాంతాల్లోని మోటారు సైకిలిస్టులనుంచి కిలో రూ.20కు కొనుగోలు చేసి అదే బియ్యాన్ని ఆలమూరు, జొన్నాడ పరిసరాల్లోని ఇటుక బట్టీల కార్మికులకు కిలో రూ.22కు విక్రయిస్తున్నాడు. సదరు బియ్యానికి ఎటువంటి బిల్లులు లేవు. దీంతో రూ.1,28,347 విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. సత్తి సతీష్‌పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్, లోవరాజు, కిశోర్, ఎస్కే ఆలీషా పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 13: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన ముద్దాడ రవిచంద్రను ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు సెక్రటేరియట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం తరుపున సహకరించాలని ముద్దాడ రవిచంద్రను ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ, పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేఎన్‌వీ ప్రసాద్, జిల్లా ట్రెజరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్ కోరారు.

గోదావరిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించిన స్థానికులు

ఐ.పోలవరం, జూన్ 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల గోదావరిలో గురువారం కొట్టుకుపోతున్న వ్యక్తిని స్థానికులు రక్షించారు. గురువారం మురమళ్ల గోదావరి బ్రిడ్జిపై నుంచి ఒక వ్యక్తి నదిలో పడి కొట్టుకుపోతుండగా బొక్కా నరేష్ వేరొకరి సహాయంతో పడవ ద్వారా అతనిని రక్షించి ఒడ్డుకు చేర్చాడు. అతడి వివరాలు తెలియలేదు. అతడికి మతిస్థిమితం లేదు.


ప్రాణాలతో బయటపడిన వ్యక్తి

ప్రకృతిపై విద్యార్థులకు అవగాహన

అంతర్వేది, జూన్ 13: మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి గురించి విద్యార్థులకు ఎస్సీసీ స్టేట్ మోనటరింగ్ అధికారిణి జి.ప్రభావతి వివరించారు. సఖినేటిపల్లిలంకలో ఏపీ ఎస్సీసీ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఏడు రోజులు జరిగే షెడ్యూల్‌లో ఆహార సుస్థిర అభివృద్ధి, భూ ఆవరణ గురించి విద్యార్థులకు వివరిస్తున్నారు. విద్యార్థులు మొక్కలు నాటడం, చేతివృత్తులు, ఆచార సంప్రదాయాలపై అవగాహన కల్పించామన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, విద్యావేత్తలు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, జూన్ 13: మండపేట ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వరరావు పాలనపై దృష్టి సారించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం వేగుళ్ల నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలకు చెందిన మండలస్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షా కాలంలో గ్రామాల్లో చేపట్టాల్సిన శానిటేషన్ పనులు, తాగునీరు గురించి ఆరా తీశారు. శానిటేషన్‌కు సంబంధించిన సమస్యలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. పలువురు కార్యదర్శులు పంచాయతీల్లో శానిటేషన్‌కు సంబంధించిన ఇబ్బందులను వేగుళ్ల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో శానిటేషన్ రోజు విడిచి రోజు నిర్వహించాలని వేగుళ్ల సూచించారు. వీధిలైట్లు, మంచినీరుపై దృష్టి సారించాలని ఆయన కోరారు. మార్చి వరకు ఉన్న పన్ను బకాయిలు వసూలు చేసి శానిటేషన్ సిబ్బందికి వేతన బకాయిలు లేకుండా చెల్లించాలన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న రోడ్లు, వాటర్‌ట్యాంకులు, వాటర్ పైపులైన్స్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడు మండలాలకు సంబంధించి వేర్వేరుగా మండల స్థాయి పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. సమీక్ష సమావేశానికి మూడు మండలాలకు చెందిన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

- జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి
- మేరీ లైఫ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాలి

ముమ్మిడివరం, జూన్ 13: విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి పేర్కొన్నారు. ముమ్మిడివరం మండల విద్యాశాఖ కార్యాలయం, జడ్పీ బాలుర, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో బొజ్జా రమణశ్రీ అధ్యక్షతన జరిగిన మేరీ లైఫ్ కార్యక్రమంలో డీఈవో కమలకుమారి మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం మేరీ లైఫ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేస్తుందన్నారు. వీటిని ప్రభుత్వప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు మేరీలైఫ్ కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ఇప్పటికే ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రోజువారీ కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించాలని ఆమె సూచించారు. సమాజంలో ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణను నైతిక బాధ్యతగా గుర్తించాలన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించే విధంగా విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఒక్కో మొక్కను నాటడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామన్నారు. సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవో-2 ఆర్.ఉదయభాస్కరరావు, హెచ్ఎం సీహెచ్ పరిమళ, బి.హనుమంతరావు పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని దత్తత తీసుకోవడంలో భాగంగా ఎంఈవో కార్యాలయం, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో డీఈవో ఎం.కమలకుమారి మొక్కలు నాటారు. సీఆర్ఎంపీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం ఎమ్మార్సీ భవనం వద్ద మొక్క నాటుతున్న డీఈవో కమలకుమారి

జిల్లాను అగ్రగామిగా నిలపాలి: డీఈవో

ముమ్మిడివరం, జూన్ 13: ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుంటూ విద్యాపరంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, తద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను అగ్రగామిగా నిలపాలని డీఈవో ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. ఎమ్మార్సీ భవనంలో ఆమె పుస్తకాల పంపిణీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కోనసీమ జిల్లా రాష్ట్రస్థాయిలో నాల్గో స్థానంలో నిలిచిందన్నారు. ఈఏడాది కూడా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేసి పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించగలుగుతామన్నారు. ప్రతీ విద్యార్థికి స్టూడెంట్ కిట్లు అందేవిధంగా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటుయాజమాన్యాల పరిధిలోని 2036పాఠశాలలు పునఃప్రారంభమైనట్టు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో బొజ్జా రమణశ్రీ, ఎంఈవో-2 ఆర్.ఉదయభాస్కరరావులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో కమలకుమారి

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై రైతుల హర్షం



ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్, బండారు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

కొత్తపేట, జూన్ 13: రైతుల గుండెల్లో దడ పుట్టించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబునాయుడు రద్దు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కొత్తపేటలో నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం కూటమి ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందన్నారు. ప్రజాపాలన అందిస్తారనే విశ్వాసం, నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చోడపనీడి భాస్కరరావు, ముద్రగడ సుబ్బారావు, వాసంశెట్టి సత్యనారాయణ, కముజు గంగాధర్, చోడపనీడి రాంబాబు, పప్పుల బుజ్జి, కాశి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

దాత స్ఫూర్తితో పంటకాల్వకు మోక్షం

మలికిపురం, జూన్13: మలికిపురం నుంచి మోరి శివారు వరకు ఉన్న మొండికోడు చానల్ పూడుకుపోయింది. అది మురికి డ్రెయిన్‌గా తయారైంది. ఈకాల్వపై ఆయకట్టుదారులు ఒక పంటకే పరిమితమయ్యారు. సార్వా పంటకు ముంపునీరు దిగకపోవడంతో సార్వా వదులుకునేవారు. రైతులు పడుతున్న ఇబ్బందిని గుర్తించిన రివర్ సైడ్ స్కూలు అధినేత డార్విన్ పంటకాల్వ మరమ్మతులకు నిధులు సమకూర్చడంతో గురువారం ముంపునీరు శంకర గుప్తం డ్రెయిన్‌లో కలిసేవిధంగా అడ్డంకులుతొలగించారు.

మత్స్యకార విద్యార్థులకు ప్రోత్సాహకాలు

యానాం, జూన్ 13: పుదుచ్చేరి మత్స్యశాఖ ద్వారా యానాం నియోజకవర్గం పరిధిలో నివసిస్తున్న మత్స్యకార విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు దడాల గొంతియ్య తెలిపారు. 10వ తరగతిలో 60శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి నగదు బహుమతి పొందడానికి జూలై 9వ తేదీలోపు దరఖాస్తును మత్స్యశాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మండపేట, జూన్13: పోస్టల్‌శాఖ అమలుచేస్తోన్న పోస్టల్‌ఇన్సూరెన్స్, సేవింగ్స్‌బ్యాంక్, పోస్ట్‌పేమెంట్, ప్రమాద బీమా, వాహన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ కె.శేషారావు కోరారు. మండపేట తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్థానిక పోస్టల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. పోస్టుమాస్టర్లు ఎస్.శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు నారాయణ, ఎండీఎం షరీఫ్, శివయ్య, కె.ఈశ్వరరావు, ఎం.అనూష పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి



ఆత్రేయపురం, జూన్ 13: నార్కెడు మిల్లిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న శంకరు ఈశ్వరరెడ్డి(36) గత నెల 16న విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. సహచర సిబ్బంది అతడిని రావులపాలెం, రాజమహేంద్రవరంల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. గురువారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా



గిడ్డి సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు

పి.గన్నవరం, జూన్ 13: టీడీపీ. జనసేన, బీజేపీ పార్టీల సూచనలతో పార్టీలకు అతీతంగా నియోజవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, పలువురు టీడీపీ శ్రేణులు గిడ్డి సత్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నామన రాంబాబు మాట్లాడుతూ కూటమిలో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి అపూర్వ విజయాన్ని అందించారని, టీడీపీ తరపున పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కుంపట్ల నాయుడు, శేరు శ్రీనుబాబు, బొరుసు సత్యనారాయణ, గుడాల వెంకటరమణ, పెదపూడి రాము, పెచ్చెట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన సుబ్బరాజు



ముమ్మిడివరం/ఐ.పోలవరం, జూన్ 13: అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబుకు గురువారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

సైనిక సంక్షేమశాఖ దరఖాస్తుల స్వీకరణ

యానాం, జూన్ 13: మాజీ సైనికుల కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు, పన్ను చెల్లింపుదారులు కాని వారి పిల్లల ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, దుస్తులు ఖర్చు తిరిగి చెల్లించేందుకు జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. పుదుచ్చేరి సైనిక సంక్షేమ శాఖకు చెల్లించిన అసలు రశీదులను జతచేసి ఆగస్టు 8లోగా అందజేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో రాష్ట్రస్థాయి, సీబీఎస్ఈ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన మాజీ సైనికుల పిల్లలు ప్రోత్సాహక నగదు కోసం దరఖాస్తు చేయాలన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ, పీజీ టాపర్లుగా నిలిచి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన సైనికులు పిల్లలు వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసి అందజేయాలన్నారు.

మంత్రి సుభాష్‌కు అభినందనల వెల్లువ



సుభాష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కడియాల రాఘవన్ తదితరులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13: మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విజయవాడలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ముమ్మిడివరం శాసనసభ్యుడు దాట్ల బుచ్చిబాబు సుభాష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రామచంద్రపురం పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, టీడీపీ నాయకులు ఈదల దొరబాబు, గుణ్ణం వినోద్‌కుమార్, బ్రహ్మం శ్రీను, హసన్‌బాద మాజీ సర్పంచ్ పచ్చిపాల వీరవెంకట్రావు, వాసంశెట్టి బాల సుభాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి సుభాష్‌కు అభినందనలు



కె.గంగవరం, జూన్13: మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను గురువారం మండలానికి చెందిన ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యండగండి గ్రామ టీడీపీ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, సత్యవాడ టీడీపీ నాయకులు సలాది రమేష్, సలాది శ్రీను, సలాది సీతారాముడు, బీజేపీ నాయకుడు బళ్లెం వెంకటస్వామి, కోటిపల్లి నుంచి రేవు శ్రీను, భట్లపాలిక నుంచి రవ్వా భూషణం సుభాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ హరీష్‌మాధుర్‌కు అభినందనలు



ఎంపీ హరీష్‌మాధుర్‌ను అభినందిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్, జూన్ 13: అమలాపురం ఎంపీగా ఘన విజయం సాధించిన గంటి హరీష్‌మాధుర్‌ను గురువారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్లు అన్యం రాంబాబు, పీఎస్ రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు అధికారులు కలిసి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అల్లవరం మండలానికి చెందిన డ్వాక్రా మహిళలు హరీష్‌మాధుర్‌ను సత్కరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హరీష్‌మాధుర్‌ను అభినందనలతో ముంచెత్తారు. అమలాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన అయితాబత్తుల ఆనందరావును గురువారం టీడీపీ కార్యాలయంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు కలుసుకుని అభినందనలతో ముంచెత్తారు. ఆనందరావుకు పలువురు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. చేనేత సంఘ నాయకులు పిచ్చిక శ్యామ్, గంటు ఫణిప్రసాద్, పుత్సల వరదరాజులు, చింతా శంకరమూర్తి, బళ్ల వీర్రాజు, మాడా మాధవి, బళ్ల వెంకటేశ్వరరావు, చింతపట్ల మోహన్, కాశిన బాబి అభినందించి సత్కరించారు.

ఆనందరావును కలిసిన అధికారులు

అల్లవరం, జూన్ 13: అమలాపురం ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావును అల్లవరం ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అల్లవరం మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆనందరావు వారికి సూచించారు. ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, పంచాయతీల కార్యదర్శులు అడబాల రాజేశ్వరరావు, ఎస్.దుర్గాశ్రీనివాస్, ఎస్.రాజమోహన్, శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

ముమ్మిడివరం, జూన్ 13: అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులను అమలాపురంలోని వారి క్యాంపు కార్యాలయాల్లో గురువారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌ను త్వరితగతిన పూర్తిచేసి కోనసీమ ప్రజల చిరకాల వాంఛను తీర్చాలన్నారు. కార్యక్రమంలో బోనం కృష్ణ, జంపన సుమన్‌వర్మ, గోపిశెట్టి అచ్చియ్య తదితరులు ఉన్నారు.

తిరుకల్యాణ మహోత్సవాల ఆహ్వానపత్రికలు ఆవిష్కరణ

పి.గన్నవరం, జూన్ 13: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల ఆహ్వానపత్రికలను జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. తొలుత ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణ అధికారిణి గ్రంధి మాధవి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వాసు, స్థానిక కూటమి నాయకులు గిడ్డి సత్యనారాయణను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి కల్యాణానికి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు మెల్లేటి శ్రీనివాసరావు, జాలెం శ్రీనివాసరాజా, తుండూరి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులను కలిసిన టీడీపీ, జనసేన నేతలు



అల్లవరం, జూన్ 13: ఘన విజయం సాధించిన అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మంత్రి వాసంశెట్టి సుభాష్‌లను అల్లవరం మండల టీడీపీ, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలిపారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో నాయకులు వేగిరాజు వెంకట్రాజు, ఆకుల లక్ష్మణరావు, కాండ్రేగుల వాణిఅచ్యుతం-సత్యనారాయణ, జనసేన నాయకులు కంకిపాటి వీరబాబు, గుర్రం కృష్ణ, నల్లా రాము, పిండి గణపయ్య, పిల్లా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వెలిచేరు నుంచి వాడపల్లికి పాదయాత్ర

ఆత్రేయపురం, జూన్ 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా చేరుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. గురువారం వెలిచేరు శివారు యూజీపాలేనికి చెందిన 200మంది పాదయాత్రగా వచ్చారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కవల సత్తిబాబు, బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు అయినం నాగరాజు, మాజీ సర్పంచ్‌మిద్దే శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పాదయాత్రగా వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఆత్రేయపురంలో వారికి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఘన స్వాగతం పలికారు.

టీడీపీ విజయోత్సవ వేడుక

అల్లవరం, జూన్ 13: టీడీపీ కూటమి విజయం పేదల పాలిట వరమని, రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు గుబ్బల రామ్‌ప్రసాద్ అన్నారు. మొగళ్లమూరి, కోడూరుపాడు గ్రామాల్లో టీడీపీ కూటమి విజయోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. అల్లూరి గోపాలకృష్ణంరాజు, గుబ్బల నాగేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు, నార్ని కుమారస్వామి, అల్లు సత్తిబాబు, రాయుడు రాంబాబు, చప్పిడి తాతారావు, కాండ్రేగుల వెంకటసత్యనారాయణ, పితాని చిన్నా పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: రక్షణ
శేఖర్ స్క్రీన్-1	: ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	: బ్యాడ్‌బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

దేవాంగ సాధికార కమిటీ సభ్యుడు నాగశేఖర్ మృతి



మామిడికుదురు, జూన్ 13: జిల్లా దేవాంగ సాధికార కమిటీ సభ్యుడు, మొగలికుదురు మాజీ సర్పంచ్ లక్కింశెట్టి సుబ్బలక్ష్మి భర్త లక్కింశెట్టి నాగశేఖర్ గురువారం ఉదయం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మూడు దశాబ్దాలుగా గ్రామంలో ఆర్ఎంపీగా వైద్య సేవలందించారు. నాగశేఖర్ కుటుంబాన్ని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, కొండా జగదీశ్వరరావు, దొంగ సత్తిబాబు, కె.శ్రీను పరామర్శించి సానుభూతి తెలిపారు.

మోటారు వైర్లు చోరీ

ఆత్రేయపురం, జూన్ 13: లొల్లలో రైతుల వ్యవసాయ బోర్‌లకు సంబంధించి విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి తీసుకుపోయారు. పది మంది రైతుల పంట పొలాల్లోని మోటారు షెడ్లలో తాళాలు బద్దలుకొట్టి వైర్లను కట్ చేసి తీసుకుపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల చెంతనే ప్రభుత్వ మద్యం దుకాణం ఉండడంతో ఎవరైనా ఆకతాయిలు మోటారువైర్లు కత్తిరించారా లేక దొంగతనానికి పాల్పడ్డారా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రైతులు స్థానిక పోలీసులకుతెలిపారు.

సత్యనారాయణ మృతికి పంచాయతీ ఉద్యోగుల సంతాపం

అల్లవరం, జూన్ 13: అల్లవరం పంచాయతీలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసి అందరి మన్ననలు పొందిన ఇసుకపూడి సత్యనారాయణ మృతికి సర్పంచ్ బొమ్ము బాలవేణి, పలువురు సంతాపం తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో గురువారం సత్యనారాయణ మృతికి సంతాపంగా ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్, కె.సూర్యశంకరరాజు, రాణి, డి.బాలరాజు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

అమలాపురం రూరల్, జూన్ 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఉపాధి హామీ పథకం నిదుల్లో కోత విధించి ఉపాధి పథకాన్ని కూలీలకు దూరంగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం ఆయన వ్యవసాయ కార్మిక సంఘ ప్రతినిధులతో కలిసి మండల పరిధిలోని బండారులంక, నడిపూడి గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను చెల్లించాలన్నారు. పంటకాల్వలను మురుగు డ్రెయిన్లుగా మార్చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి కూలీలకు ఏటా 200రోజులు పని దినాలు కల్పించడం, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. కార్మిక సంఘ ప్రతినిధులు పొలమూరి శ్రీనివాసరావు, ఎం.రాజేశ్వరి, జి.తేజకుమారి, టి.లక్ష్మి, శ్రీదేవి, దుర్గాదేవి, ఎస్.నాగలక్ష్మి, జి.మంగాదేవి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

అమలాపురం రూరల్, జూన్ 13: ఎన్నికల అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు ఎస్పీ ఎస్.శ్రీధర్ గురువారం తెలిపారు. డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆధ్వర్యంలో తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు వై.శేఖర్‌బాబు, జి.హరీష్‌కుమార్, కేఎం జోషీ ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైలెన్సర్లు తీసి వాహనాలు నడిపిన వారిపై ఐదు కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్టు డీఎస్పీ తెలిపారు. ప్రధానంగా విద్యార్థులు, యువత దుశ్చర్యలకు పాల్పడవద్దని క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు పాడవుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వివాదాస్పద మెసేజ్‌లను పంపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా గ్రూపులపై పోలీసుల నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు.

సుభాష్‌ను సన్మానించిన ఎంపీపీ

రాజోలు, జూన్ 13: మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఎంపీపీ కేతా శ్రీను గురువారం విజయవాడలో కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సుభాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి హాజీ ముఖ్రం హుస్సేన్, చిట్టూరి సంతోష్, పవన్ ఉన్నారు.



ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం

కపిలేశ్వరపురం, జూన్ 13: కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురం అగ్రహారం వద్ద నూతనంగా నిర్మించనున్న శ్రీవరసిద్ధి వినాయక ఆలయానికి గ్రామానికి చెందిన, తణుకులో స్థిరపడిన పారిశ్రామికవేత్త కాటూరి లక్ష్మణరావు, విజయవెంకటలక్ష్మి దంపతులు గురువారం ఆలయ ట్రస్టు సభ్యులకు రూ.50,004 విరాళం అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, జూన్ 13: నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెదపట్నంలంకలో శుక్రవారం ఉదయం8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సీహెచ్ రాజేంద్ర తెలిపారు.

ఎంపీడీవోగా సరోవర్ బాధ్యతలు



అంబాజీపేట, జూన్ 13: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జీవీ సరోవర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన అల్లవరం ఎంపీడీవోగా పనిచేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కె.వరలక్ష్మి పనిచేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును ఎంపీడీవో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈవోపీఆర్డీ బి.మమత, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఇతర ఉద్యోగులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయం, రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు పి.నాగపద్మలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్, ఎం.వెంకటరమణ, వి.లక్ష్మిపతి, ఆర్.ఏడుకొండలు చంటి, వీఆర్వోలు పాల్గొన్నారు.